క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రముగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

పథకాలు అర్హులకు అందేలా చూడాలి



భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్ని పథకాలను అర్హులకు అందేలా చూడాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం యానిమేటర్లు, మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులకు నిర్వహించిన ఆర్థిక నిర్వహణ శిక్షణ ప్రారంభ సభలో ఆమె పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బొంతా అర్జునరావు విచ్చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం బుధవారం కూడా కొనసాగుతుందని తెలిపారు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రా స్వరాజ్యలక్ష్మి, సీసీలు పాల్గొన్నారు.

ఈవీఎంలు సిద్ధం



వేమూరు: ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని నియోజక వర్గం ఎన్నికల అధికారి జె.మోహనరావు అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈవీఎంలపై అభ్యంతరాలుంటే తన దృష్టికి తీసుకొనిరావాలని ఆయన చెప్పారు. రాజకీయ నాయకుల పూర్తి సహకారం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డాడ్జి బాల్ రాష్ట్ర జట్టుకు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక



తెనాలి: బాపట్ల జిల్లా చిలుమూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–14 డాడ్జ్ బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా తరఫున ఆడిన స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. ఇదే నెలలో వారణాసిలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు కె.కైలాష్, నాయుడు రెడ్డి, టి.ఆనంద్‌వర్ధన్‌రెడ్డి ఎంపికైనట్టు మంగళవారం నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులను, పీఈటీ పి.బాబీవెస్లీ, జి.తేజాను సంస్థ డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ అభినందించారు. వీరితో కో–ఆర్డినేటర్ షెహనాజ్, చౌదరి, శ్రీనివాస్ ఉన్నారు.

యాచకునికి అంత్యక్రియలు

తెనాలిఅర్బన్: యాచన చేస్తు జీవించే వృద్ధుడికి శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి సభ్యులు మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో 60 సంవత్సరాల వృద్ధుడు యాచిస్తూ జీవించేవాడు. మంగళవారం ఓ దుకాణం ముందు మృతి చెందాడు. దుకాణ దారులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆప్రాంతంలో అతడి గురించి విచారించి ఎవరు లేరని తెలియటంతో శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనుకు విషయం తెలియజేసి అంత్యక్రియలు నిర్వహించాలని కోరారు. దీంతో సమితి సభ్యులు బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పిన్నెల రాఘవ, పోతురాజు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

- బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాలను స్థాపించడంతో పాటు పిట్టలవానిపాలెంలో రూ.7.50 కోట్లతో అత్యాధునిక హంగులతో వైద్యశాలను నిర్మించడం గర్వకారణమన్నారు. ఖాజీపాలెం గ్రామ సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు రూ.21 కోట్లకు పైగా లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, రక్త శాతం వైద్య పరీక్షలను ఎమ్మెల్యే కోనరఘుపతి చేయించుకున్నారు. మందుల లభ్యతపై ఆరా తీశారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ వినయ్, జనరల్ ఫిజీషియన్‌లు డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్, డాక్టర్ మురళీ, డాక్టర్ లోకేష్, ఎంఎస్ జనరల్ సర్జన్ డాక్టర్ కిన్నెర, ఎంఎస్ ఆఫ్తామాలజిస్ట్ డాక్టర్ అశ్విత పాల్గొని, 800 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు.

గ్రామ సర్పంచ్ కుంతం అనూష, ప్రసన్నరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

కర్లపాలెం: ప్రజలందరికీ వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మండలంలోని గణపవరం ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను సందర్శించారు. ప్రజలందరికీ గ్రామంలో ఉచితంగా మెరుగైన వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు దోహదపడతాయని చెప్పారు. గణపవరం గ్రామంలో ఇప్పటి వరకు రూ.16కోట్ల నిధులతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరిగాయని చెప్పారు. గ్రామంలోని రోడ్డు నిర్మాణానికి మరో రూ.2కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. డీపీవో రాంబాబు, గ్రామ సర్పంచ్ దేవరకొండ అంకమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీమానిక, డాక్టర్ రమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బర్లంకలో వైద్య శిబిరం..

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బొబ్బర్లంక జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం జరిగింది. విశ్వేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు ఎస్ఎస్‌వీ సుబ్బారావు, వాసవీ, ఆర్.ప్రసాద్, వి.రవిచంద్ర 262 మందిని పరీక్షించి, వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రీచరణ్, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నగరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. నగరంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 640 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో మెరుగైన వైద్య పరీక్షల నిమిత్తం 37 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డి.సైదానాయక్, తహసీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, డాక్టర్లు భవానీశ్రీ,, తులసి, రాజేశ్వరి, దుర్గాప్రసాద్, గ్రామ సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, ఎంపీటీసీ ఉప్పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కొల్లూరు : మండలంలోని చినపులివర్రులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల ప్రత్యేకాధికారి రమణ, కొల్లూరు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, ఎంఈఓ–2 టీవీఎస్ జ్యోతి శిబిరాన్ని పర్యవేక్షించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన, రోగులకు అందజేస్తున్న మందులను అధికారులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. 368 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రవిబాబు, ఐసీడీఎస్ దోనేపూడి సెక్టార్ సూపర్‌వైజర్ నగరాజకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే వైద్య సేవలు..

నిజాంపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకురావడం జరుగుతుందని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. దిండి పంచాయతీ సచివాలయ ఆవరణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున, డాక్టర్ సాయి దీప్తి, డాక్టర్ సుభాషిణీ, డాక్టర్ అకిల్ వర్మ, డాక్టర్ రమేష్ బాబు 567 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఆరుగురిని మెరుగైన వైద్య పరీక్షలకు రిఫర్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యేమినేని రాంబాబు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్ మురళీ పాల్గొన్నారు.

కుచ్చెళ్లపాడులో వైద్య శిబిరం

కుచ్చెళ్లపాడు(వేమూరు): మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకట సురేష్, డాక్టర్ రవళీ, డాక్టరు కోటేశ్వరీ, డాక్టరు సంతోష్ రాయల్ రోగులకు వైద్య సేవలు అందించారు. 279 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభం

అంబేద్కర్(వేమూరు): చుండూరు మండలంలోని అంబేద్కర్ నగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ జాలాది రూబేను మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో సుగుణమ్మ, వైద్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం..

పెదపులివర్రు(భట్టిప్రోలు): ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి అన్నారు. పెద పులివర్రు జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సీహెచ్ రామలక్ష్మి, ఎన్. కృపా సుమతి, రమాకాంత్, రాజేశ్వరి పాల్గొని, రోగులకు వైద్య సేవలు అందించారు. ప్రజా ప్రతినిధులు జగనన్న ఆరోగ్య సురక్ష ఫోల్డర్లు, బ్యాగ్‌లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం. హనుమంతరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బొంతా అర్జునరావు, సర్పంచ్ నీలా ఉషారాణి, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



పెదపులివర్రులో ఆరోగ్య కార్డులతో గ్రామస్తులు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదలకు ఆరోగ్యానికి భరోసా

బాపట్ల అర్బన్: బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి మంగళవారం ప్రారంభించారు. సురక్ష సర్వేలో 1,200 మంది టోకెన్లు తీసుకోగా 677 మంది శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 32 మంది గైనిక్, 102 మంది కంటి సమస్యలతో బాధ పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. 25 మంది చిన్న పిల్లల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించారు. మిగిలిన 518 మంది జనరల్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి రాఘవరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డీముక్కల డేవిడ్, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరు రాణి, బాపట్ల ఎంపీడీఓ ఎ.రాధాకృష్ణ, ఈఓపీఆర్డీ పులి శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.



చినపులివర్రులో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



మందుల కిట్ అందిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ మురళీ



బొబ్బర్లంకలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

సీఎం వైఎస్ జగన్ పాలనలో వెల్లివిరుస్తోన్న సంక్షేమం

- ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు
- ఆరేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆరేపల్లి(చెరుకుపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం వెల్లివిరుస్తోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. చెరుకుపల్లి మండలం ఆరేపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలిపువ్వు కోటేశ్వరరావు ఘన స్వాగతం పలికారు. మహిళలు మోపిదేవికి హారతులు పట్టారు. ఎంపీ మోపిదేవి గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా అని పరిశీలించాలని, వలంటీర్లకు సూచించారు. కర పత్రాలను అందజేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీ మోపిదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పయనం ఏడుకొండలరెడ్డి, మండల పరిషత్, పంచాయతీ సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధిని మహిళకు వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

పీతల సాగులో నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

నిజాంపట్నం: పీతల సాగుబడిలో నీటి యాజమాన్య పద్ధతులు, మెళకువలు పాటించాలని మత్స్యశాఖ సహాయకురాలు టి.రామకోటేశ్వరమ్మ అన్నారు. నిజాంపట్నం సచివాలయం–1 పరిధిలోని కొల్లాటి ధానమూర్తి ఆక్వా చెరువు వద్ద మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరమ్మ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలను గుర్తింపు పొందిన ల్యాబ్‌లో చేయించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని చెప్పారు. చెరువు చుట్టూ తప్పనిసరిగా ఒక మీటర్ ఎత్తులో ఫెన్సింగ్ ఉండాలని, దీని ద్వారా పీతలు బయటకు రాకుండా ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా రొయ్యలు, పీతల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్ సుబ్రహ్మణ్యం, మత్స్యశాఖ వీఎఫ్ఏలు కోటేశ్వరమ్మ, సీహెచ్ బ్రహ్మం, శంకర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ సహాయకులు రామకోటేశ్వరమ్మ

తెనాలిలో ప్రజా సంఘాల బ్లాక్ డే

తెనాలి: రైతాంగ ప్రదర్శనపై ఉద్దేశపూర్వకంగా జీపును నడిపి ముగ్గురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారకుడైన కేంద్ర మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్‌మిశ్రా చేసిన దుర్మార్గానికి నిరసనగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం కార్మిక, రైతు సంఘాలు తెనాలిలో బ్లాక్ డే పాటించారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న రైతాంగ ప్రదర్శనలో జరిగిన దారుణంపై దేశవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాలు ఇచ్చిన బ్లాక్ డే పిలుపుకు అనుగుణంగా పట్టణంలో భారీ ప్రదర్శన చేశారు. రైతుకూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్లాక్ డే ప్రదర్శనలో వివిధ సంఘాల నేతలు

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం: గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచ్ దబ్బుకూటి మాధవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సచివాలయంలో ప్రత్యేక వైద్య నిపుణులు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు.

నేడు అద్దేపల్లిలో...

భట్టిప్రోలు: అద్దేపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేలో భాగంగా టోకెన్లు తీసుకున్న వారికి వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

టిడ్కో గృహాలు అందజేయాలి

రేపల్లె: లబ్ధిదారులకు టిడ్కో గృహాలను ప్రభుత్వం వెంటనే అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో 1,300 మంది టిడ్కో గృహాలకు గత ప్రభుత్వంలో ఎంపికయ్యారని, వీరికి ఇంత వరకు గృహాలు అందించలేదన్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. అంగలకుదురులో అనధికారికంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామానికి చెందిన ఎస్.బాబర్ వద్ద 13 క్వార్టరు సీసాలు లభించాయి. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చలం తెలిపారు.

మహాత్మ ఆశ్రమ నిర్వాహకుడికి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు

తెనాలిటౌన్: పట్టణానికి చెందిన మహాత్మ ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం చిట్యాలలోని మహాత్మగాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, ఐఆర్ఎస్ అధికారి ఎం.భూపాల్‌రెడ్డి సోమవారం లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డును రామలింగాచారికి అందజేశారు. 20 ఏళ్ల నుంచి ఆశ్రమంలో వృద్ధులకు ఉచిత భోజనం, వసతి, ప్రాథమిక వైద్యసేవలు అందిస్తుండడంతో గుర్తింపుగా అవార్డు అందజేసినట్లు రామలింగాచారి తెలిపారు. గాంధీ జయంతి రోజున అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.



ఐఆర్ఎస్ అధికారి భూపాల్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న రామలింగాచారి

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

డీపీఎం వాణిశ్రీ

అద్దేపల్లి(భట్టిప్రోలు): తక్కువ పెట్టుబడితో అధిక లబ్ధి పొందేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదపడుతుందని బాపట్ల డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ (డీపీఎం) వాణిశ్రీ అన్నారు. భట్టిప్రోలు–2 సచివాలయం పరిధిలోని ఆర్బీకేలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీపీఎం వాణిశ్రీ మాట్లాడుతూ చీడపీడల నుంచి వరి పైరు రక్షణ చర్యలను చర్చించారు. సిబ్బంది అందరూ పొలాలను –ఏ గ్రేడ్ మోడల్‌గా తీర్చుదిద్దుకోవాలని ఆదేశించారు. టీటీడీకి పంట ఇచ్చే రైతులను సీఎం యాప్ కింద నమోదు చేయాలని కోరారు. పాము పొడ తెగులు నివారణ చర్యలు, పేడ, మూత్రం, ఇంగువ ద్రావణం 5 టీసీ 100 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆకుముడత నివారణకు నీమాస్త్రం 100లీటర్లు, దశపర్ణి కషాయం 4 నుంచి 6 లీటర్లు పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎల్ఎంపీ జె.మోహన్, ఎన్ఎఫ్ఏ బీవీ శ్రీనివాసరావు, సూరేపల్లి యూనిట్ ఇన్‌చార్జి దోవా ఝాన్సీరాణి, సిబ్బంది రవి, శ్రీవల్లి, వర్ధనం, 12 మండలాల ఎంటీలు, ఎల్ –1, ఎల్ –2లు పాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని భర్తరఫ్ చేయాలి

భట్టిప్రోలు: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని క్యాబినెట్ నుంచి భర్తరఫ్ చేయాలని, రైతుల మరణాలకు కారకుడైన అతని కుమారుడిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని రైతు సంఘాల నాయకులు మంగళవారం భట్టిప్రోలులో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు డి. వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కె. రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మర్రివాడ వెంకట్రావు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు జి. బాలాజి, వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దారు వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేత

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల అందించిన వివరాలు.. తెనాలి– విజయవాడ రైలు మార్గంలోని కొలకలూరు స్టేషన్ సమీపంలో సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మంగళవారం రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టిందా అన్న అంశంపై స్పష్టత లేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.